క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి



కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లికి చెందిన గువ్వాడి సునీల్‌కు చెందిన హర్యానా పాడి గేదె బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిపల్లిలో తమ పశువుల షెడ్డు నుంచి హర్యానా పాడిగేదెను నీళ్లు తాగించేందుకు తీసుకెళ్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు వాపోయాడు. మృతి చెందిన గేదె విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, తమను ఆదుకోవాలని కోరాడు. కాగా షెడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు 15 రోజులుగా ఎర్త్ వస్తుందని, ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని బాధితుడు తెలిపాడు.

నేడు చెక్కుల పంపిణీ

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సుభాషిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'మార్నేని'కి అభినందన

ఆత్మకూరు : నూతనంగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టీస్కాబ్) చైర్మన్‌గా ఎన్నికైన మార్నేని రవీందర్‌రావును బుధవారం ఆత్మకూరు సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వారసంత వేలం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంత వేలంపాట బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించినట్లు ఎంపీఓ సీహెచ్ రవికుమార్ తెలిపారు. వేలంపాటలో 22మంది సభ్యులు పాల్గొనగా మండల కేంద్రానికి చెందిన ఐత అశోక్ రూ.8లక్షల 500లకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యదర్శి తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టుల 3కే రన్

నయీంనగర్: ప్రెస్ క్లబ్ సభ్యులకు నిర్వహిస్తున్న క్రీడల నేపథ్యంలో గురువారం ఉదయం 6గంటలకు ప్రెస్ క్లబ్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు జర్నలిస్టుల 3కే రన్ ఉంటుందని ప్రెస్‌క్లబ్ కమిటీ తెలిపింది. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో క్రీడల ఉంటాయని పేర్కొంది.

ఘనంగా బీరన్న బోనాలు



కమలాపూర్ : మండలంలోని వంగపల్లిలో బీరన్న బోనాల వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై బీరన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాదన్నపేట, నేరెళ్ల గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. కురుమ, యాదవ కులపెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



ఐనవోలు : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నందనం గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న గడ్డం అశోక్ ఉదయం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకు జారి చెట్టుపై నుంచి కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

నడికూడలో..

నడికూడ : వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు మోకుజారి తలకిందులు అయ్యాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అతడిని కాపాడారు. ఈ సంఘటన మండలంలోని రాయపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చక్రపాణి గౌడ్ రోజు మాదిరిగానే మంగళవారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో మోకుజారి చెట్టుపై తలకిందులు అయ్యాడు. తోటి కార్మికులు స్థానిక ఎంపీటీసీకి తెలపగా ఆయన వెంటనే పరకాల సీఐకి సమాచారం అందించాడు. దీంతో స్పందించిన సీఐ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని చక్రపాణిని సురక్షితంగా కిందికి దింపారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఫైర్ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య
- ఎమ్మెల్యేలు గండ్ర, రేవూరి
- బడిబాటలో పుస్తకాలు, యూనిఫాం పంపిణీ



శాయంపేట : ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర



పరకాల : నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఎల్కతుర్తి : గొల్లపల్లిలో ప్రభుత్వ పాఠశాలను పునఃప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూరులో..



కమలాపూర్: యూనిఫాం అందజేస్తున్న నాగపద్మజ



వేలేరులో..

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీలత అధ్యక్షతన బుధవారం విద్యార్థులకు నోటుబుక్స్, యూనిఫాం పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వేసవి సెలవుల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌళిక వసతులు సమకూర్చడానికి ప్రభుత్వం సుమారు రూ. 500కోట్ల కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, విద్యుత్, ఫ్లోరింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేస్తున్నామని అన్నారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు ఎలాంటి లోటు రాకుండా చూస్తానన్నారు. విద్యార్థులను కోతుల బెడద నుంచి కాపాడేందుకు గ్రిల్స్ ఏర్పాటుకు తన నిధుల నుంచి రూ. 3లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం 2023–24లో 10వ తరగతిలో 9.5 పాయింట్లు సాధించిన కే.వర్షిత, 9.2 సాధించిన ఏ.భానుశ్రీని శాలువాతో సన్మానించారు. జిల్లా వెల్ఫేర్ అధికారి మధురిమ, తహసీల్దార్ సుభాషిణి, ఎంపిడిఓ ఫణిచంద్ర, ఇన్‌చార్జ్ ఎంఈఓ రమాదేవి, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తిరుపతమ్మ, శ్రీలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణి, రవి, రవీందర్, కృష్ణమూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యారంగంలో సమూల మార్పునకు శ్రీకారం చుట్టబోతున్నామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. గత విద్యాసంవత్సరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించగా వారిని అభినందిస్తు నోట్‌బుక్కులు, బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, ఎంపీడీఓ ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, తహసీల్దార్ భాస్కర్, ఎంఈఓ రమాదేవి, కౌన్సిలర్లు జయమ్మ, సంపత్, ప్రధానోపాధ్యాయుడు మధుకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డీఆర్‌డీఓ నాగపద్మజ కోరారు. పాఠశాలల పునఃప్రారంభోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆమె ప్రభుత్వం నుంచి ఉచితంగా సరఫరా అయిన యూనిఫాం, పాఠ్య పుస్తకాలను అందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తోందని అన్నారు. క్రీడలకు అనువైన మైదానాలు ఉన్నాయని, శిక్షణ పొందిన, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించి వేలల్లో ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు కూడా పాఠశాల ప్రారంభం నుంచే యూనిఫాం ధరించాలన్న సంకల్పంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు కుట్టు శిక్షణనిచ్చి వారితో యూనిఫాం కుట్టించి అందిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా తమ పిల్లలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను, హ్యాండ్ వాష్ ట్యాప్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, హెచ్‌ఎం పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ మండ కల్యాణి, ఫిజియోథెరపీ డాక్టర్ నాగవంశీ, ఐఈఆర్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని ఐదేళ్ల క్రితం మూసివేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం రీ ఓపెనింగ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంఖ్య తగ్గువగా ఉన్న పాఠశాలలను మూసివేయాలని ఆదేశించడంతో భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతబడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు తిరిగి రీ ఓపెనింగ్ చేశారు. ఈ గ్రామ పాఠశాలకు శామల అనే ఉపాధ్యాయురాలును డిప్యూటేషన్‌పై నియమించారు. వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని వివరించారు. విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, అలాగే ఆగ్ల బోధన అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు సుముకత చూపించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను పునర్ ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నన్నెబోయిన తిరుపతి, శ్యామల, గ్రామస్తులు సంపత్, రాజయ్య, నవీన్, కొమురయ్య, రాజమల్లు, రేణుక, లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ అరుణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని వల్బాపూర్‌లో జరిగిన యూనిఫాం పంపిణీలో ఎంపీటీసీ అనూష పాల్గొని విద్యార్థులకు యూనిఫాం అందించారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమైయ్యాయి. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి, మల్లికుదుర్ల పాఠశాలలో జెడ్పీటీసీ చాడ సరిత ముఖ్య అతిథులుగా హాజరై పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు రాజన్న, జయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ గుండాల నాగరాజు, ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్ బుధవారం యూనిఫాం, నోటుబుక్కులు అందించారు. మండల్ నోడల్ ఆఫీసర్ హనుమంతురావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు : ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో బుధవారం బడిబాటను నిర్వహించారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలను స్పెషల్ ఆఫీసర్ రాజేందర్, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం వలన తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మలకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, నోడల్ అధికారి దుర్గాప్రసాద్, సోమయ్య, ఎస్జీఓ కోఆర్డినేటర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

- తల్లి, బిడ్డ క్షేమం



ఐనవోలు : పురుటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు ఇలాఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన బరిగల జ్యోతికి పురిటి నొప్పులు వస్తుండగా ఆమె భర్త భరత్‌కుమార్ 108 వాహనానికి సమాచారం ఇచ్చాడు. దీంతో 108 వాహనం హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకుని జ్యోతిని వరంగల్ సీకేఎమ్ ఆస్పత్రికి తీసుకెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 టెక్నిషియన్ సుధా తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సీకేఎమ్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పైలెట్ సుధాకర్, ఆశా వర్కర్ ఉన్నారు.

ఆర్‌జీబీ సమావేశం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రంలోని బుధవారం భరతమాత మండల సమాఖ్య ఆర్‌జీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అస్సాం నుంచి మోడల్ సీఎల్‌ఎఫ్, ఈసీ మెంబర్లు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత మాట్లాడుతూ.. సమాఖ్య పనీతీరు బాగుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సకాలంలో విద్యార్థులకు యూనిఫాం అందించడం జరిగిందన్నారు. గతంలో కంటే ప్రస్తుతం సమాఖ్య సంఘాలు మెరుగుపడ్డాయని అన్నారు. ప్రభుత్వం సామాఖ్య సంఘాలను గుర్తించి తమకు యూనిఫాం కుట్టించే బాధ్యత అప్పగించి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఏ బాధ్యతలు అప్పగించినా మరింతగా రెట్టింపు ఉత్సాహంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. స్పెర్ డైరెక్టర్ రవీందర్‌రావు, అడిషనల్ డీఆర్‌డీఓ సుధీర్, డీపీఎం దేవానంద్, సీసీలు రామతార, బాలసుందర్, కరుణాకర్, సదానందం, సతీష్, ఓరుగల్లు పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన లారీ



శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామ శివారులోని మొద్దులచెరువు వద్ద పరకాల నుంచి హనుమకొండకు వెళుతున్న లారీ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణానికి చెందిన కోటేశ్వర్‌రావుకు చెందిన లారీ కేటీపీపీ ఫ్లైయాష్ లోడు చేసుకొని బుధవారం హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో మొద్దులచెరువు మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. డ్రైవర్ పంకజ్‌సింగ్ సురక్షితంగా బయటపడినట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి హామీలో వ్యక్తిగత పనులకే ప్రాధాన్యం

- డీఆర్‌డీఓ నాగపద్మజ



ప్రజావేదికలో మాట్లాడుతున్న నాగపద్మజ

కమలాపూర్ : ఉపాధి హామీ పథకంలో పశువులు, గొర్రెల పాకలు, పండ్ల తోటల పెంపకం వంటి వ్యక్తిగత పనులకే అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఓ నాగ పద్మజ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 1-4-2023 నుంచి 31-3-2024 వరకు మండలంలో జరిగిన రూ.4.80 కోట్ల ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈనెల 4 నుంచి 11 వరకు గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. అనంతరం డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. పండ్ల తోటల పెంపకం, నాడెప్ కంపోస్ట్ పిట్లు, సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులు సేంద్రియ వ్యవసాయం చేసేలా కృషి చేస్తున్నామన్నారు. జూలై 1 నుంచి తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టి రోడ్ల పక్కన, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. ఇళ్లలో పెంచుకునేందుకు సీతాఫలం, నేరేడు, బొప్పాయి, మునగ వంటి మొక్కలు పంపిణీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశామని, ఒక్కో నర్సరీలో 10 వేల చొప్పున మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ గుండె బాబు, డీవీసీ ఇన్‌చార్జ్ నర్సింహరెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి పాక శ్రీనివాస్, అంబుడ్స్ పర్సన్ నాగరాజు, ప్లాంటేషన్ మేనేజర్ పెద్ది శ్రీనివాస్, ఈసీ .శ్రీధర్‌రావు, ఏపీఓ రమేశ్, ఎస్సార్పీ చెన్నకేశవులు, సిబ్బంది సాగరిక, పూర్ణచందర్, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటా మిషన్ భగీరథ సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇంటింటా మిషన్ భగీరథ నల్లా సర్వే చేపట్టినట్లు ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లేశం, ఏఈ రవికుమార్, ఎంపీఓ రఘుపతిరెడ్డితో కలిసి ఫీల్డ్ విజిట్ చేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా..? లేదా..? వారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 97 లాగిన్ల ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, వీఓఏలు, అంగన్‌వాడీలు, ఆశాలు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం వరకు సర్వే కొనసాగుతుందన్నారు. మండలంలోని ప్రతి ఇంటికి నల్లా నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నీరు అందని ఇంటిని గుర్తించి వెంటనే నల్లా కనెక్షన్ ఇచ్చి సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. గ్రామస్తులు మిషన్ భగీరథ సర్వేకు సహకరించాలని అధికారులు కోరారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



దామెర : మండల కేంద్రంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ కోరారు. బుధవారం దాతలను కలిసి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, ముద్దసాని సహోదర్‌రెడ్డి, డాక్టర్ శ్రీరాంరెడ్డి, మాదారపు రవికుమార్, మాదారపు యాదగిరి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, వద్దిరాజు సత్యనారాయణరెడ్డి విరాళాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలోని పురాతన పోచమ్మ ఆలయం స్థలంలో నూతనంగా ఆలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించి, ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు భద్రయ్య, శ్యామ్, భిక్షపతి, అశోక్, రమణాచారి, కృష్ణమూర్తి, రవికుమార్, శంకర్, శంకోజు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కల్యాణలక్ష్మి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : రాష్ట్రంలోని నిరుపేదలకు కల్యాణలక్ష్మి పథకం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. 46 మంది లబ్ధిదారులకు రూ.46.5 లక్షల విలువ గల చెక్కులు అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ ఫలాలు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ రాధిక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పర్వతగిరి రాజు, వాసు, జైపాల్‌రెడ్డి, సామేల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



వేలేరు : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నలివెల దిలీప్ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలిచిన కౌశిక్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అని విమర్శించారు. మరోసారి మంత్రి పొన్నంపై అనుచిత వాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామాల్లో తిరగనీయరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజనీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి :ప్రణవ్



ప్రణవ్‌కు ఆలయ సమస్యలు తెలుపుతున్న భక్తులు

కమలాపూర్ : మండలంలోని తీగలబావి వద్ద గల భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం పలువురు భక్తులు మంగళవారం రాత్రి ప్రణవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన.. ఆలయ అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి హద్దులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు పెరుమాండ్ల పర్శరాములు, అంకుషావళి, మౌటం రమేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మండ అశోక్, సభ్యులు మండ రాజేశ్‌కుమార్, మౌటం వీరన్న, కాల్వ కుమార్, కొయ్యడ సునీల్, రాజు, మహేందర్, రాహుల్, సుధాకర్, నరేష్, తిరుపతి, కిశోర్, రంజిత్, వెంకటేష్, పవన్, రాజేందర్, ఆలయ అర్చకుడు రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

జైలుకెళ్లిన ఉద్యమకారులకు పింఛన్



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య, స్వామి

నయీంనగర్: 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయబోతోందని, ఈక్రమంలో జాబితాలో పేర్లు లేనివారు ఆధారాలు సమర్పించాలని తెలంగాణ మూవ్‌మెంట్ డిటెన్యూస్ ఫోరం (1969) బాధ్యులు తిప్ప సారయ్య, ననుమాస స్వామి, అమృతరెడ్డి కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన పోరాటయోధులు ఎఫ్ఐఆర్ కాపీలను ఫోరంకు సమర్పించాలని సూచించారు. హనుమకొండ కోర్టు నుంచి పొందిన ఎఫ్ఐఆర్ కాపీల్లో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలన్నారు. జైలుకు వెళ్లిన ప్రతీఒక్కరు పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు.

చిన్నారి చేతులకు బరువులమోత



శాయంపేట : చిన్నారి చేతులకు బరువులమోత తప్పలేదు. మండల కేంద్రంలోని బాలిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్కులు, యూనిఫాం అందిచేందుకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం హాజరయ్యారు. ఈ క్రమంలో అక్కడకు వచ్చిన వారు కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రైమరీ పాఠశాల నుంచి విద్యార్థులతో ఉపాధ్యాయులు ఇలా బెంచీలు మోయించారు. అక్కడే ఉన్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తోంది.